క్లుప్తంగా

స్కోచ్ అవార్డు సెమీ ఫైనల్‌లో పిఠాపురం

పిఠాపురం: స్కోచ్ అవార్డుల్లో పిఠాపురం మున్సిపాలిటీ సెమీ ఫైనల్‌కు చేరినట్టు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇవ్వనున్న స్కోచ్ అవార్డుల్లో పిఠాపురం మున్సిపాలిటీ చెత్త సేకరణ, వినియోగం, పరిశుభ్రత తదితర విభాగాల్లో సెమీ ఫైనల్‌కు చేరినట్టు చెప్పారు.

మకర జ్యోతి దర్శనం



నాగులపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయం

కొత్తపల్లి : అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం పరమ పవిత్రమని భక్తులు భావిస్తున్నారు. స్థానికంగా ఉన్న ధర్మశాస్తా, నాగులపల్లిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ఆభరణాల అలంకరణ, అనంతరం జ్యోతి దర్శనం ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గుండాటలపై పోలీసుల దాడులు



గొల్లప్రోలు మండలం కొడవలిలో గుండాట శిబిరాన్ని తొలగిస్తున్న పోలీసులు

పిఠాపురం: వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గుండాటలపై క్రైం డీఎస్పీ ఎస్ రాంబాబు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. గుండాటలు ఆడేవారిని అదుపులోకి తీసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. సంప్రదాయబద్ధంగా కోడిపందేలు మాత్రమే నిర్వహించుకుంటామని స్థానికులు కోరడంతో, వాటికి అనుమతి ఇచ్చారని, అనుమతి లేని జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకుని రెండో వార్డు, 23వ వార్డు సత్యనారాయణపురంలో మంగళవారం ముగ్గుల నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కనుమతో సంక్రాంతి ఉత్సవాలు ముగియడంతో ముగ్గుల పోటీలు ముగిశాయి. స్థానిక సత్యనారాయణపురంలో ఆ వార్డు కౌన్సిలర్ సేపెని సురేష్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. డిజైనింగ్ ముగ్గులలో కె.స్వాతి, కామాక్షి, భవానీ బహుమతులు గెలుచుకున్నాయి. చుక్కల ముగ్గుల్లో ప్రథమ, లోకారెడ్డి విజయలక్ష్మి, కోల్లాటి కృష్ణవేణి ద్వితీయ, పూల స్వరూప తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మర్తాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 2వ వార్డులో ఆవార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ చంటి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

గో పూజతో దోషాలు మాయం

- కనుమ సందర్భంగా గోవులకు పూజలు
- ఆలయాల్లో కిటకిటలాడిన భక్తులు



పొలాల్లో వృషభానికి పూజలు చేస్తున్న సామర్లకోటకు చెందిన రైతు కుటుంబం

సామర్లకోట: కనుమ పండగ రోజున గోమాతను రక్షిస్తే సుఖసంతోషాలు కలిగి, దోషాలు పోతాయని పంచారామ క్షేత్ర అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ అన్నారు. గోక్షీరం, గోమయం, గోపంచకం ఎంతో విశిష్టమైనవని ఆయన అన్నదాతలకు వివరించారు. బిక్కిన సత్యపరమేశ్వర సాయి మకాంలో ఉన్న ఆవులకు రైతులు పూజలు చేశారు. దేవదాయశాఖ ఆదేశాల మేరకు ధర్మపథం కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రంలో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలోని నంది విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నాతిపాముల సూరి బాబులు పాల్గొన్నారు. అలాగే రైతులు తమ పొలాల్లో గోపూజ చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి గోవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని, వాటిని రక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని పట్టణ రైతు సంఘ నాయకుడు బిక్కిన సత్యపరమేశ్వర సాయి అన్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కళాకారుల వేషధారణలు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బళ్లపై ఊరేగుతున్న వేషధారులు



కొత్తపల్లి మండలంలో నిర్వహిస్తున్న కోడిపందేలు

వెల్లివిరిసిన సం'క్రాంతి'

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సంబరాలతో కళకళలాడిన గ్రామాలు
- నేటితో ముగియనున్న పండగలు

పిఠాపురం: సంక్రాంతి అన్ని వర్గాల ప్రజలకు పెద్ద పండగే. పంటలన్నీ చేతికంది, ధాన్యం రాశులతో నిండిపోయే ధనుర్మాసంలో వచ్చే మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి.. పిల్లల నుంచి పెద్దల వరకు అందరిలోనూ నూతన కళను రేకెత్తించింది. పల్లెలు పట్టణాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. తెలుగుతనం ఉట్టి పడేలా, సంక్రాంతి విశిష్టతను వివరించేలా మహిళలు వేసిన ముగ్గులు తమ వాకిళ్లకు కొత్త అందాలు తెచ్చారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, బుడబుక్కల వాళ్లు, జంగమదేవరలు వీధుల్లో కలియతిరిగారు. కొత్త సినిమాలు, కొత్త దుస్తులు, కొత్త ధాన్యం, కోడి పందేలు, కొత్త అల్లుళ్ల రాకతో అత్తవారింట సందడే సందడి నెలకొంది. ప్రతి ఇంటా పిండివంటలు ఘుమఘుమలాడాయి. రైతుల ఇళ్లల్లో ముందుగా తెచ్చిన ధాన్యంతో అటుకులు ఆడించడం ఆనవాయితీగా మారడంతో పాటు, ప్రతి గ్రామంలోనూ అటుకులు కొత్త దుస్తులు తమ పెద్దల పేరు చెప్పి ఇతరులకు దానం చేయడంలో చాలామంది బిజీగా మారారు. వివిధ గ్రామాల్లో యువతులు పోటీపడి రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వివిధ వేషధారణలు అమితంగా ఆకట్టుకున్నాయి.



పిఠాపురంలో అయ్యప్ప స్వామివారి దివ్యాభరణాలను మోసుకెళుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

భక్తులతో నిండిన ఆలయాలు

మకర సంక్రాంతి రోజున బియ్యం, నువ్వులతో శివుడ్ని అభిషేకిస్తే మంచిదన్న నానుడి ఉండడంతో, గ్రామస్తులు అభిషేకాలకు ప్రాధాన్యమిచ్చారు. కొత్తపల్లి, పిఠాపురం అయ్యప్పస్వామివారి ఆలయాల్లో మకరజ్యోతి దర్శనాలు కనులపండువగా జరిగాయి. దీంతో ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ఉత్తరాయ పుణ్యకాలంలో చేసే జపాలు, పారాయణలు, దానాలు అనేక రెట్ల ఫలితాన్నిస్తాయని, అష్టైశ్వర్యాలు కలుగజేస్తాయని శాస్త్రాలు చెబుతుండడంతో, మకర సంక్రాంతి రోజున దానాలు చేయడానికి ప్రాధాన్యమిచ్చారు. పలువురు ధాన్యం, బంగారం, వస్త్రం, ఆవు, కాయగూరలు, చెరకు, నువ్వులు దానం చేశారు. శివాలయాల్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురం అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ఆభరణాలను పాదగయ క్షేత్రం నుంచి స్వామివారి ఆలయం వరకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు శిరస్సున ధరించి, పాదయాత్రగా తీసుకువెళ్లారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం ఆభరణాలను స్వామివారికి అలంకరించారు.



దివ్యాభరణాల అలంకారంలో పిఠాపురంలోని అయ్యప్ప స్వామివారు

జోరుగా కోడి పందేలు

కొత్తపల్లి: మండలంలోని అనేక గ్రామాల్లో మంగళవారం కోడి పందేలు, గుండాటలు జోరుగా సాగాయి. వాకతిప్ప, కొండెవరం, ఇసుకపల్లి, కొమరగిరి, పొన్నాడ, కొత్తపల్లి, పొన్నాడ, రమణక్కపేట, శ్రీరాంపురం, గొర్స తదితర గ్రామాల్లో కోడిపందేలను గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు.

ఉత్సాహంగా కావమ్మ తిరునాళ్లు

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



సామర్లకోటలో కావమ్మ, మారెయ్యలను దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: కావమ్మ తిరునాళ్లు ఉత్సాహంగా జరిగాయి. సోమవారం ప్రారంభమైన ఈ తిరుణాలు బుధవారంతో ముగుస్తాయి. కనుమ పండగ, మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు తరలి వచ్చి కావమ్మ, మరెయ్యలను దర్శించుకొని మొక్కులు తీసుకున్నారు. స్థానిక రజక వీధిలో ఏలేరు కాలువ ఆవలివైపు కావమ్మ ఆలయాన్ని సుమారు 250 ఏళ్ల క్రితం నిర్మించారు. సంక్రాంతి మూడు రోజులూ ఇక్కడ ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. స్థానిక బెస్తకులానికి చెందిన సుకపట్ల లక్ష్మయ్య, వెంకయమ్మ దంపతులకు చెందిన కావమ్మ కాత్యాయిని వరంతో జన్మించింది. చిన్న వయసులోనే ఈశ్వర సంభూతుడైన మారయ్యను వివాహం చేసుకొంది. భర్త మృతితో కావమ్మ సతీ సహగమనం చేసుకున్న ప్రదేశంలో కావమ్మ, మారెయ్యల విగ్రహాలతో ఆలయాన్ని నిర్మించారు. కావమ్మ మృతదేహాన్ని స్నానం చేయించిన ప్రదేశంలో బావిని ఏర్పాటు చేశారు. ఆ బావి నిత్యం నీటితో నిండి ఉంటుంది. దాంతో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొ ఇక్కడ తిరునాళ్లు జరుగుతాయి. ఈ తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను బావిలో వేస్తారు. అవి తేలితే మగ బిడ్డ, మునిగితే ఆడ బిడ్డ పుడతారని భావిస్తారు. మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో నీటిలో బెలూన్ ఏర్పాటు చేసి చిన్నారులను ఆకర్షించే విధంగా చేశారు. దాంతో చిన్నారులు ఆ బెలూన్‌లో విన్యాసాలు చేశారు.

ముగిసిన సంక్రాంతి సందడి

సామర్లకోట: సంక్రాంతి సందడి ముగిసింది. కనుమ రోజున అనేక మంది ఉపాహారం పెట్టుకుని మాంసాహారంతో తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. సంప్రదాయంగా జరిగే ఆటపాటలతో పాటు కోడి పందేలు నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు కుటుంబ సమేతంగా వీకే రాయపురం, వేట్లపాలెంలోని కోడి పందాలను తిలకించారు. కాగా పెద్దాపురం మండలంలో కట్టమూరు, ఆర్బీ కొత్తూరు, పులిమేరు, గుడివాడ, దివిలి గ్రామాల్లో కోడి పందాలు. సామర్లకోట మండల పరిధిలో పనసపాడు, వేట్లపాలెం, ఉండూరు, వికె రాయపురం, అచ్చంపేట, మాధవపట్నాల్లో కోడి పందెం శిబిరాలు, గుండాటలు నిర్వహించారు. ఒక్కొక్క శిబిరంలో ప్రతి పందేనికి రూ.2 లక్షల నుంచి ఐదు లక్షల వరకు పందేలు జరిగాయి.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని ప్రజలంతో సంతోషంగా గడిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి గ్రామ మహిళలు గేమ్ షో నిర్వహించగా విజేతలకు గ్రామ పెద్దలు బహుమతి ప్రదానం చేశారు.



మరిడమ్మ ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న ఈఓ

అలాగే ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాండ్రకోటలో గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణాలయంలో గీతా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా గ్రామంలో నగర సంకీర్తన చేశారు. నూకాలమ్మ ఆలయంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు గోపూజ నిర్వహించారు.

మరిడమ్మ ఆలయంలో కనుమ రోజున గోపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద గోపూజ నిర్వహించారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేటలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా నాట్యమండలి, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, రన్నింగ్, మహిళలతో పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనిరెడ్డి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మున్సిపల్ చైర్మన్ బొద్దు తులసీ మంగతాయారు, సీపీఎం మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ తదితరులు ప్రసంగించగా ముగ్గుల పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. యాసలపు రమేష్, రొంగల తాతారావు, జి.అపర్ణ, షేక్ నాగూర్, చల్లా విశ్వనాథం, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు, నెక్కల రవిచంద్ర, సిరికి జానకి, సిరిపురపు వరలక్ష్మి, యాసలపు స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు..

సంక్రాంతి పండగ కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేల శిబిరాల్లోనే గుండాట, జూదాలకు నిర్వహించారు.



పెద్దాపురం మండలం దివిలిలో నిర్వహిస్తున్న కోడి పందేలు



ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



మంగళవారం వేట్లపాలెంలో జరిగిన కోడి పందేలు

వైభవంగా సత్తెమ్మ తల్లి సంబరం

- అంబరాన్నంటిన సాంస్కృతిక కార్యక్రమాలు
- జాతరను ప్రారంభించిన దవులూరి దొరబాబు

పెద్దాపురం: స్థానిక జగ్గంపేట రోడ్డులోని సత్తెమ్మ తల్లి సంబరాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. భారీ విద్యుద్దీపాలతో స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ నగర్ వరకు భక్తులు క్యూలో గంటల తరబడి నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సంబరాన్ని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కళ దంపతులు ప్రారంభించగా ఆలయ నిర్వాహకులు పప్పల నాగరాజు ఆధ్వర్యంలో పప్పల పెదబాబు భక్త బృందం వేద పండితుల మంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామనని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన జాతరను ప్రారంభించగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ లతా కుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి జాతరలో పూజలు నిర్వహిస్తున్న దొరబాబు, కళ దంపతులు

అంబరాన్నంటి సంబరం

జాతరను పురష్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. 108 గరగలతో భారీ నృత్యం, కాళికా వేషాలు, లంబాడి, ఆర్కెస్ట్రా బ్యాండ్‌మేళాలు, ఒంటెలు, కోలాటాలను భక్తులు ఆస్వాదించారు.

ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు

పిఠాపురం: నియోజకవర్గంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెల రోజుల నుంచి వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, గోదాదేవి కల్యాణాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమ, మంగళవారాల్లో పంచమాధవ క్షేత్రమైన కుంతీమాధవస్వామి, వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆయా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ ఈఓ తెలిపారు.



పిఠాపురం కుంతీమాధవ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న గోదా కల్యాణం

ఉప్పువారి సత్రం ఆధ్వర్యంలో వస్త్రదానం



ధర్మకర్తల ఆధ్వర్యంలో చేస్తున్న వస్త్రదానం

సామర్లకోట: స్థానిక ఉప్పువారి సత్రం ధర్మకర్తల ఆధ్వర్యంలో పెద్ద పండగ సందర్భంగా సోమవారం వస్త్రదానం చేశారు. ఏటా సంక్రాంతి రోజున పేదలకు వస్త్రదానం చేస్తారు. పిఠాపురం రోడ్డులో ఉప్పు సీతారామయ్య పేరున ఆయన కుమారులు సత్యనారాయణ, సూర్యారావు అక్టోబర్ 30వ తేదీ 1941న సత్రాన్ని స్థాపించి 26 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమిని సాగు చేసుకొవడానికి బహిరంగ వేలం నిర్వహించి లీజుకు ఇస్తుంటారు. ఆ భూమిపై వచ్చే ఆదాయంతో పిఠాపురం రోడ్డులో వెళ్లే బాటసారులకు తాగునీరు, వేసవి కాలంలో మజ్జిగ, సంక్రాంతి పర్వ దినంలో వృద్ధులకు వస్త్రదానం, మహాశివరాత్రిలో పంచారామ క్షేత్రం వద్ద భక్తులకు మజ్జిగ, పాల పంపిణీతో పాటు కార్తిక మాసంలో వన సమారాధనలు దేవదాయశాఖ అనుమతితో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సీతారామయ్య మనవడు, సూర్యారావు కుమారుడు అయిన సత్యనారాయణ వ్యవస్థాపక ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

ఘనంగా జాతీయ సైనిక దినోత్సవం



మాజీ సైనికులను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 76వ జాతీయ సైనిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికుడు ఎస్‌డీ రామారావు మాట్లాడుతూ దేశాన్ని సురక్షితంగా ఉంచడానికి భారత సైన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మాజీ సైనికులు రామారావు, శ్రీనగేష్‌లను అడబాల రత్నప్రసాద్ ఘనంగా సన్మానించారు.

అక్రమ మద్యం స్వాధీనం

కాకినాడ క్రైం: పండగ వేళ భారీ మొత్తాలకు విక్రయించేందుకు నిల్వ చేసిన అక్రమ మద్యం సెబ్ బృందం ముమ్మర తనిఖీలలో పట్టుబడింది. సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లు సత్ఫలితాలు ఇచ్చాయని సెబ్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కాకినాడ పరిధిలో కొత్తపేట మార్కెట్‌లో నివాసం ఉంటున్న గంగుమళ్ల జయరాం అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం సీసాలు భద్రపరిచి కోడి పందేలు నిర్వహించే బరుల్లో అధిక మొత్తానికి విక్రయించేందుకు సిద్ధం చేశాడు. విశ్వసనీయ సమాచారంతో సీఐ వెంకటేశ్వరరావు బృందం తనిఖీలు చేసి 50 నిబ్‌లను స్వాధీనం చేసుకుంది. అలాగే, కాకినాడ గ్రామీణ మండలం నేమం గ్రామంలో వాసంశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి నుంచి 19 నిబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురు నిందితులనీ కాకినాడ నార్త్ సెబ్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

మంచు కురిసే వేళలో..



కొత్తపల్లి మెయిన్ రోడ్డులో ఉదయం పది గంటలకు కూడా తొలగని మంచు తెరలు

పిఠాపురం: మంచు తెరలు ముంచేస్తుంటే.. చలికి తట్టుకోలేక భోగి మంటలను ఆశ్రయించాల్సి వచ్చింది. బారెడు పొద్దెక్కినా సూరీడు కనిపించనంతగా మంచు తెరలు కమ్ముకున్నాయి. ఉదయం పది గంటలైనా మంచు తెరల చాటున సూరీడు దోబూచులాడుతూ 'కనిపించ లేదు'.

భక్తి శ్రద్ధలతో మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం



మాండవ్య నారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: అతిపురాతన విష్ణు ఆలయమైన స్థానిక శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగింది. ధనుర్మాసం ముగింపు, కనుమ పండగను పురస్కరించుకుని ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు, స్టేషన్ సెంటర్ మీదుగా రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. తమ తమ ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.